# ఆమె రాలేదు

బొమ్మిరెడ్డి పల్లి భానుశ్రీ

అర్ధరాత్రి. గదిలో జీరో వాల్టు బల్బు వెలుగుతోంది. పక్క గదిలో అవుతున్న ఏవో శబ్దాలకి మెలకువ వచ్చి లేచిందామె. "ఏమండీ, ఏవో శబ్దాలవుతున్నాయి. ఒకసారి లేవండి—" గాభరాగా లేపిందతన్ని.

ఒక్క నిమిషం చెవులు రిక్కించి విన్నాడు. ఎవరైనా దూరేరా! కొద్దిగా భయం వేసినా "ఏం లేదులే, పడుకో. అయినా ఏమున్నాయి మనింట్లో అంత విలువైనవి — దోచుకోడానికి" — ముసుగు పెట్టి పడుకున్నాడు. మళ్లీ శబ్దాలు, ఏవో అడుగుల చప్పుడు, చిన్నగా గుసగుసలు... ఆమె గుండె దడదడలాడింది. మెల్లగా లేచి తడుముకుంటూ లైటు స్విచ్ వేసి తలుపుతీసింది.

అంతే! కెవ్వున కేకవేసింది. తమక్కావలసిన వస్తువుల్ని గబగబా పెట్టెలో సర్దుకుంటున్న ఇద్దరు వ్యక్తులు ఉలిక్కిపడ్డారు. ఒకడు గబగబా వచ్చి, ఆమె చేతులు వెనక్కి విరిచి పట్టుకున్నాడు. ఆమె గింజుకుంటూంది. అరుస్తూంది. "ఏమండీ లేవండీ రక్షించండి...."

అతను లేచాడు. ఎదురుగా వున్న దృశ్యం చూసి అదిరిపోయాడు. ఎవరో రౌడీ చేతుల్లో తన భార్య! రెండో వ్యక్తి అతని వైపు రావడం చూసి, భయంతో అటూ ఇటూ పరుగెత్తి - వంటింట్లో దూరి తలుపేసుకున్నాడు, ఆంజనేయుణ్ణి తలచుకుంటూ వణికిపోతూ! మూసిన తలుపుల వెనక నుంచి గట్టిగా అరిచేడొకడు. "ఏమయ్యోయ్! జాగ్రత్తగా తలుపులేసుకో. మేం పోతున్నాం...."

గుండె దడ తగ్గిలేదతనికింకా. కాస్సేపాగి బయటికొచ్చేడు. ఇల్లంతా ఖాళీ. అంతా వెతికాడు. మండిపోయాడు. "అమ్మో! ఎంత తెగించావే! నువ్వా వాడితో పోయావా? మళ్లీ ఈ యింట్లో ఎలా అడుగుపెడతావో చూస్తాను. నిన్ను మళ్లీ ఏలుకుంటాననుకుంటున్నావేమో!" గుండె బాదుకుంటూ గాభరాగా అటూ ఇటూ తిరుగుతున్నాడు, రాగానే ఆమెనెలా హింసించాలో మధ్య మధ్య ఆలోచిస్తూ.

ఆ వ్యక్తులు రెండు గుర్రాలమీద చాలాదూరం ప్రయాణం చేసి ఒక చెట్టు కింద ఆగారు. ఆమెను దించి కాళ్లకి చేతులకి ఉన్న కట్లు విప్పారు. వెంటనే ఆమె చేతులు జోడించి తననేం చెయ్యొద్దని, వదిలేయమని ప్రార్థించడం మొదలు పెట్టింది. పక్కనే సెలయేరు. సన్నటి - నక్షత్రాల వెలుగు. ఆ నిశ్శబ్ద నీరవంలో - తమ అదృష్టం బాగుండి ఒక స్త్రీ కూడా వుండడం అంటే! ఇద్దరూ అలసటగా కూర్చుని సంచిలోంచి బాటిల్స్ తీసుకుని తాగడం మొదలుపెట్టారు.

ఆమెనేం చెయ్యాలో తోచలేదు. ఇష్టంలేని స్త్రీని



అనుభవించడం మానవత్వం కాదు. మగతనం అసలే కాదు. అది పిరికివాళ్ళు, చేతకాని వాళ్ల చేసేపని అంటూ రెచ్చగొట్టింది. కావాలంటే ఈ నదిలో పడి ప్రాణాలు తీసుకోవడం తనకి పెద్ద కష్టం కాదంది. కాని ఒక స్త్రీని నిస్సహాయురాల్ని చేసి హింసించి అనుభవించడం.....

ఒక వ్యక్తి చటుక్కున లేచి ఆమె ముందుకి వచ్చి నిలబడ్డాడు. బెదిరిపోయిందామె. "అమ్మా! మేం దొంగలం కావొచ్చు. రౌడీలం కావొచ్చు. కాని మేం మనుషులం కూడా..." రెండో వ్యక్తి వైపు తిరిగాడు. "ఒరేయ్! లే! ఈమెను ఇంటి దగ్గర దింపేసి వద్దాం..."

అంతే!... కరెంట్ పోయింది. మంచి క్లైమాక్స్‌లో వుంది సీను. పావుగంట... అరగంట... హాల్లో అరుపులు, ఈలలు... ఉక్క, చెమట.... సగం హాలు ఖాళీ అయిపోయింది.

** ** **

దూరంగా చర్చిలో రెండు గంటలు కొట్టిన శబ్దం. టేకీ రాడ్స్‌కి తగిలిన వెన్నెల విరిగి ముక్కలయి పరుచుకుంది నేల మీద. చిన్న గది. ఇరుగ్గా, సఫకేటింగ్‌గా... గరగరమని శబ్దం చేస్తూ తిరుగుతున్న సీలింగ్ ఫాన్... ఏ క్షణంలో మీద పడుతుందోనని భయమే! అతి కష్టం మీద సృష్టించ బడుతున్న గాలిలాంటి గాలి. అంత వరకు పశువులా దున్ని — మొద్దులా నిద్రపోతున్నాడు శంకర్రావు పక్కనే.

ఒక్కసారి అతని వైపు చూసి నెమ్మదిగా లేచింది పూర్ణిమ. తలగడ తీసుకుని బాల్కనీలోకి వచ్చింది. బయటికి చూసింది.

విశాలమైన ప్రపంచం...

ఊరంతా మత్తుగా నిద్రపోతూంది. శబ్దాల కలవాటు పడిన నిశ్శబ్దం.

కొద్ది దూరంలో అవుటర్ హార్బర్. కన్వేయర్ బెల్ట్ చేస్తున్న నిరంతరం శబ్దం. పోటీగా సముద్రపు హోరు...

మౌనంగా తమ ప్రతిబింబాలు చూసుకుంటున్న దీపాల మధ్య - నిశ్శబ్దంగా షిప్పులు...

వెండి ముద్దలా మెరిసిపోతున్న చందమామ.

చల్లగా, హాయిగా, మత్తుగా ఫిలాసఫర్ కింగ్‌లా ప్రపంచాన్నేలుతున్న వెన్నెల...

ఉండుండి - చల్లని గాలి తెర. తను కుండీల్లో ప్రేమగా పెంచుతున్న లిల్లీలు, మల్లెలు, గులాబీలు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి.

చాప మీద పడుకుని చందమామనే చూస్తోంది పూర్ణిమ. మదిలో ఆ సినిమా - ఎక్కడికి పోతుంది చివరికామె?... మళ్లీ వెనక్కి భర్త దగ్గరికే... నో... నో... వెళ్లదు. ఇన్నాళ్ల జరిగిన ఆ యుద్ధంలో ఆమె గెలిచింది. ఎంత చిత్రవధ అనుభవించింది - మానసికంగా, శారీరకంగా! ఆ దొంగ కున్న మానవత్వం కూడా వాడికి లేదు. ఎన్నిసార్లామెను బలవంతంగా, దౌర్జన్యంగా.. ఓహ్...!

ఆమెలో ఎక్కడో, ఏదో మేలుకుంటూంది. హృదయం బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూంది.


ఆమెను తన చెప్పు చేతల్లో వుంచుకోవడమే వీరత్వమనుకునే వాడు, ప్రతిక్షణం ఆమె శీలాన్ననుమానించి ఆనందించే వాడు, మరో మగాడి చేతుల్లోంచి ఆమెను రక్షించలేకపోయేక ఇంకేం మగవాడు?... నిజంగా శీలం లేని దెవరికి...?

కన్వేయర్ బెల్ట్ విపరీతంగా చేస్తోంది రొద. ఎప్పుడూ తను విసుక్కునే ఆ రొద ఇప్పుడు "రిథమిక్"గా వినిపిస్తోంది. సున్నితంగా తనని నిద్ర లేపుతోంది.

ఆ దొంగ ఎంత మంచివాడు! ఎంత గొప్ప వ్యక్తిత్వం! దర్జాగా మొగుడి ముందే ఆమె నెత్తుకుపోయేడు. కాని ఆమె కిష్టంలేదని తెలిశాక ఆమె ఒంటి మీద చెయ్యైనా వేశాడా? ఎంత ఔన్నత్యం...! మరి... చివరికామె... లేదు.... వెనక్కి వెళ్లదు... వెలుగును వెతుకుతూ... ముందుకే....!

పూర్ణిమలో రక్తం వేగంగా ప్రవహించింది. ఏదో ఆత్మవిశ్వాసం ఆవేశంగా తలెత్తింధి... రెస్ట్‌లెస్‌గా అటూ ఇటూ దొర్లింది. అతనితో పోరాడి, పోరాడి అలసిపోతూంది. జీవితమంతా పూర్తిగా విరక్తిగా, వెగటు గా.... ప్చ్...! ఆమెకీ, తనకీ ఎక్కడుంది తేడా...?

ఈ మూడేళ్ల వైవాహిక జీవితం ఒక దౌర్జన్యపు పీడ



కల! పెద్ద సముద్రాన్నిదే నిస్సహాయ ప్రాణి తను. ఎదురీదుతున్న కొద్దీ మహా సముద్రం... మరీ విశాలమయి పోతుంది. అర్థంలేని ఎగ్జాషన్...!

పెళ్లైన కొత్తలో....

"ఏమండీ, బయట వెన్నెల చూశారా ఎంత బావుందో! చల్లటి గాలి... హాయిగా వుంది. బాల్కనీలో పడుకుందామా?" ఉత్సాహంగా అడిగింది.

విచిత్రంగా చూసి వంకరగా నవ్వేడతను. "బయట 'ఓపెన్'గా అలా బరితెగించి పడుకోడానికి మనమేమయినా...."

"అబ్బా! ఏముందిందులో? ఇంతెత్తున ఈ మేడ మీద బాల్కనీలో ఎవరో పడుకున్నారని ఊరంతా నిద్రలు మానుకుని తొంగి చూస్తారా?"

"ఛి ఛీ! ఇంకా నయం. అలాంటి సిగ్గులేని ఆలోచనలు పెట్టుకోకు..."

"సిగ్గు! మనమేం తప్పుచేశామని! పోనీ నేను పడుకుంటాను..."

"ఒద్దన్నానా! నా కిష్టం లేదు..." విసురుగా ఆమెను మంచం మీదకి తోసి బాల్కనీ తలుపులు మూసేశాడు నిర్దయగా......

చల్లటి గాలి తెర. అప్రయత్నంగా కళ్లు మూసుకుందామె. ఏవేవో గుర్తు చేస్తోంది కన్వేయర్ బెల్ట్.

........ ఆఫీసు నుంచి వస్తూ తనతో మరో ఇద్దర్ని తీసుకొచ్చేడు శంకర్రావు. నాలుగు కప్పుల్లో కాఫీలు కలిపి ముగ్గురికీ ఇచ్చి తనో కప్పు తీసుకుంది. శంకర్రావు ఇంక తప్పదన్నట్టు ఆమెను పరిచయం చేసేడు. తరువాత మరో ప్రాణి అక్కడ వుందన్న విషయం కూడా పట్టించుకోకుండా వారి మాటల్లో వారు... చాలా ఎంబరాసింగ్‌గా అనిపించి లోపలి కొచ్చేసింది. వాళ్లు వెళ్లిపోయాక శంకర్రావు లోపలి కొచ్చి, "వాళ్లున్నంత సేపు అలా అక్కడే కూర్చోవాలా? లోపలి కొచ్చి నీ పనేదో నువ్వు చూసుకోవచ్చుగా! ఎవరైనా వచ్చేసరి కల్లా అలా కాఫీలు అమర్చేయక్కర్లేదు" అన్నాడు కోపంగా.

ఇదేం సంస్కారం? ఇంటికొచ్చిన వారికి కనీసం కాఫీ అయినా ఇవ్వకుండా, మాటయినా మాట్లాడకుండా... "మీరు వాళ్లింటి కెళ్లినా అంతేనా?"

"ఆ... వాళ్ల ఆడవాళ్లెవరూ అసలు బయటికే రారు. ఇలాంటి ఫార్మాలిటీలు, పరిచయాలు... ఎందుకివన్నీ?"

ఛీ! ఛీ! తల్చుకోడానికే అసహ్యమేసే సంఘటనలు... నల్లటి మబ్బుల్లా కమ్మేసి మనసును చీకటి మయం చేసేశాయి.

........ చీర పాక్ చేయించి, బిల్లు చెల్లించి షాపులోంచి బయటికొచ్చేరు పూర్ణిమ, శంకర్రావు. గబ గబా నడుస్తున్నాడు శంకర్రావు. అబ్బా! పక్కన తనుంది కదా! కాస్త నెమ్మదిగా నడుస్తేనేం! బిజీగా తిరుగుతున్న వాహనాల్ని తప్పించుకుంటూ రోడ్డు క్రాస్ చేసేరిద్దరూ! పూర్ణిమ రెండడుగులు ముందుకు వేసి అతని చెయ్యి పట్టుకుని నడుస్తోంది. నెమ్మదిగా విడిపించుకున్నాడు. కొంత దూరం నడిచేక మళ్లీ పట్టుకుంది అప్రయత్నంగా....

## క్రాంతి-విక్రాంతి

ఏది శాంతి
ఆమరణ క్రాంతి?
అవిరామ అన్వేషణ!

రాళ్లను చీల్చేమొగ్గ
తలెత్తే కోరికల మొక్క
గోడ్డువార పోషణ లేని బాల్యం,
వినోదాల పలాయనంలో
క్రమశిక్షణ లేని యౌవ్వనం
రైలు రాకపోకల విరామంలో
విశ్రాంతి లేని వృద్ధాప్యం
ఇక్కడే పరిష్కారాలు దొరికేదాకా
ఏది శాంతి?
రావలసిన విక్రాంతి!

—సౌభాగ్య

"ఇలా రోడ్ల మీద వెట్టా పట్టాలేసుకుని తిరక్కపోతే మనం భార్యా భర్తలమని ఎవరికీ తెలీదా?" కూల్‌గా అన్నాడు.

దెబ్బతిన్నట్టు చూసింది పూర్ణిమ.......

ఇలా ఎన్నో! అద్దంలాంటి ఆమె మనసు ముక్కలు ముక్కలయిపోయింది. సంవత్సరం కాకుండానే, తనకు తెలియకుండానే, కనబడని ఈ ఊబిలో కూరుకుపోయింది. ఓహ్...! వాల్యూమ్స్ ఆఫ్ జడత్వం! భరించలేని బోర్‌డమ్. చదవాలంటే మంచి పుస్తకాలయినా వుండవు. నోరారా మాట్లాడదామంటే మనుషులు కూడా... కనీసం మంచి పాటలు విందామన్నా.... అన్ని విధాలా నిర్వీర్యురాలయి పోయింది - అతని సాహచర్యంలో తను.

"అమ్మా! అమ్మగారూ! పాలు..." దబదబ బాదేస్తోంది తలుపు. అప్పుడే తెల్లవారిపోయిందా! అంతా మామూలుగా, అతి సాధారణంగా...

శంకర్రావు ఆఫీసుకెళ్లిపోయాడు... అంతే! మళ్లీ రాత్రి ఎనిమిది దాకా...!

బీరువా తెరిచి ఏవో నోట్‌బుక్స్ బయటికి తీసింది... శేఖర్... స్వీట్ శేఖర్...

మబ్బులు ముసురుకుంటున్న తన జీవితంలో... శేఖర్ రాక... అనుకోని ఆశా రేఖ...! శేఖర్ చేసిన సహాయం ఈ జన్మలో మరచిపోలేదు. చిన్నప్పటి నుంచి అక్కా... అక్కా అంటూ తన వెంట తిరిగిన శేఖర్... యూనివర్సిటీలో ఎమ్మెస్సీలో జాయినయేడు. తనని వెతుక్కుంటూ వచ్చిన శేఖర్‌ని సడన్‌గా చూడగానే ఎంత హాయిగా, రిలీఫ్‌గా అనిపించింది! కాని ఆ రోజు శంకర్రావు చేసిన ఫార్స్.... ప్చ్..!

నెమ్మదిగా మంచం మీద వాలింది పూర్ణిమ. ఇవాళేం చదవాలని పించడం లేదు.

.... "అక్కా! నువ్వెలాగైనా ఎమ్మేకి కట్టు. నీ క్కావలసిన సహాయం అంతా నేను చేస్తాను."

"ఇప్పుడు నాకు ఎమ్మే ఏంటి శేఖర్? ఎవర్నుద్ధరించాలి?"

"నిన్ను... నిన్ను నువ్వుద్ధరించుకోడానికి!"

"లాభం లేదు శేఖర్. నా బుర్రలోకింక ఒక్కక్షరం ముక్క కూడ దూరదు. ఇంకింతే నా జీవితం."

"ఓహ్! ఇంత పెసిమిస్టిక్‌గా ఎప్పుడు మారిపోయావక్కా నువ్వు? నిజంగా నేను నమ్మలేక పోతున్నాను. నువ్వేం వెయ్యక్కరలేదు. నేను తెచ్చిన పుస్తకాలు చదువుతుండడమే! నేను రోజూ వస్తుంటాను."

"నీకు పుణ్యముంటుంది. అంత పని మాత్రం చెయ్యకు."

"పోనీ రెండ్రోజులకోసారి."

పూర్ణిమ ఏం మాట్లాడలేదు. ఇబ్బందిగా చూసింది. శేఖర్‌కేదో అర్థమయీ అవకుండా వుంది.

"అక్కా నీకు విశాఖ నచ్చలేదా! ఎన్ని కలలు కన్నావు పెళ్లికి ముందు!"

అవును. ఎన్ని కలలు... ఎన్ని ఆశలు! విశాఖ... సముద్రపొద్దు... నిండు వెన్నెల్లో మెత్తటి ఇసుకలో.. హాయిగా నడుస్తూ అందమైన నగరంలో శంకర్రావుతో గడపబోయే జీవితం గురించి ఎన్ని కలలు! ప్రశాంతమైన వాతావరణంలో సముద్రపొడ్డున చిన్న కుటీరం లాంటి ఇంట్లో... రోజులు క్షణాల్లా గడిపేయాలని...

కాని అదే విశాఖలో ఓల్డ్ టవున్ ఏరియాలో రద్దీ సముద్ర ప్రాంతంలో, ఇరుకు గదుల్లో అంత కంటే ఇరుకైన శంకర్రావు మనస్తత్వంతో - క్షణాలు యుగాలుగా గడుపుతూ.....

అంతంలేని ఎడారిలో దారి తప్పి ప్రయాణం చేస్తూ....

శేఖర్ రోజూ మధ్యాహ్నం పూట వచ్చి ఒక గంట కూర్చుని వెళ్తున్నాడు. ఎన్నో విషయాలు చెప్తుంటాడు. ఏవేవో పుస్తకాలు తెస్తున్నాడు....

"నరేంద్ర ఆర్మీలో సెకండ్ లెఫ్టినెంట్‌గా జాయినయేడు తెలుసా! సిలిగురిలో పోస్టింగ్."

"నిజమా! అబ్బా! ఎన్నాళ్లయింది నరేంద్రని చూసి. నేను గుర్తున్నానంటావా తనకి?"

"అదేం మాటక్కా. మేం కలసినప్పుడల్లా నీ గురించే మాట్లాడుకుంటుంటాం!"

"నా గురించా? ఏముంది నా గురించి మాట్లాడ్డాని కింకా?"

"మన స్నేహాన్ని, ఆ రోజుల్ని- నువ్వు మర్చిపోయినా మేం మర్చిపోలేమక్కా..."

ఎంత అందమయిన, అమాయకమయిన రోజులవి! అందమయిన గోదావరి ఒడ్డు... నదిలో ఈతలు, నౌకా విహారాలు... స్వచ్ఛమయిన స్నేహానికి ప్రతిబింబాలు.

పూర్ణిమ, నరేంద్ర, శేఖర్.. వెన్నెల్లో నది ఒడ్డున నీడల్లా తిరుగుతూ ఎంతసేపటికో ఇల్లు చేరడం...తిట్లు

తినడం.. ఈ చెవి వంచి విని ఆ చెవి లోంచి వదిలేయడం... నరేంద్ర ఇంట్లో గడపడం తనకెంతో ఇష్టం. అతన్ని టీజ్ చెయ్యడం మరింత ఇష్టం... అదో తియ్యని జ్ఞాపకాల మూట!

"అక్కా! నరేంద్ర వాళ్లమ్మకి ఒంట్లో బావుండడం లేదు. ఇప్పుడు తనక్కడే వున్నాడు."

"నిజమా శేఖర్! నాకెంతో చూడాలని వుంది" చిన్నగా ఒణికిందామె గొంతు.

నరేంద్ర అమ్మ! స్వంత అమ్మ, నాన్నల కంటె తననెంతో ప్రేమించి, లాలించిన అమ్మ! నది ఒడ్డునే వాళ్ళిల్లు. తల్లి, తను- అంతే! సాధారణంగా ఎవరితోనూ కలిసేవారు కాదు. ఆమె ఒక పంజాబీ సోల్జర్‌ని పెళ్లి చేసుకుంది. అతను బంగ్లాదేశ్ యుద్ధంలో చనిపోయాడు. అందరికీ అదోరకమయిన చిన్నచూపు వాళ్లంటే. బంగారం లాంటి వారి హృదయాలు ఎవరిక్కావాలి? తండ్రి పోలికేమో నరేంద్ర చాల అందంగా, మేన్లీగా వుండేవాడు.

"అక్కా! నరేంద్ర నీకీ ఉత్తరం రాసేడు... నా దానితో జత చేసి."

అబ్బ! నరేంద్రని చూస్తున్నట్టే వుంది. అమ్మ ఆరోగ్యం బాగుపడుతోందని, క్వార్టర్ రాగానే తనతో తీసికెళ్లిపోతానని, తను ఎమ్మే చదువుతున్నందుకు అభినందిస్తూ, జీవితంలో దేనికీ నిరాశపడవద్దనీ, వెనకడుగు వెయ్యొద్దని, ధైర్యం, ఆత్మవిశ్వాసం- ఈ రెండూ ఎట్టి పరిస్థితిలోనూ ఒదలొద్దని, ఏ సహాయం కావలసినా తనున్నాడని- ఎంతో ధైర్యం చెప్తూ రాసేడు.

ఓహ్ నరేన్!... "శేఖర్! నిజంగా మీరిద్దరూ.. మై డార్లింగ్ ఫ్రెండ్స్.. నా రెండు కళ్ళూ మీరు..."

... రాత్రంతా నిద్ర లేకపోవడం వలన కళ్ళు రెండూ ఎర్రగా వుండి మండుతున్నాయి. అయినా నిద్ర రావడం లేదు. అలసటగా, అశాంతిగా అటూ ఇటూ దొర్లి బోర్లా పడుకుని కళ్ళు మూసుకుంది పూర్ణిమ.

... ఒకరోజు శంకర్రావు వచ్చి తన చెల్లెలు వస్తోందని చెప్పేడు. తనెంతో సంతోషించింది లక్ష్మి వస్తున్నదంటే- కాస్త ఛేంజ్ అనుకుంది. ఆమె వచ్చిన మర్నాడే ఏదో. కేంప్‌కెళ్ళేడు శంకర్రావు- పెళ్ళయింతరవాత మొదటి సారిగా. అర్థమయింది అంత హఠాత్తుగా లక్ష్మి రావడంలో ఆంతర్యం.... ఛ! ఎంత అవమానం!

వీధి చివరనున్న పాన్‌షాపు నుంచి చవకబారు అద్దె పుస్తకాలు తెచ్చి చదవడం తప్ప మరో పనిలేదు ఆ పిల్లకి. ఎప్పుడో తాతల్నాటి డొక్కు రేడియో ఒకటుంది ఇంట్లో! అది ఆన్ చేసేసరికల్లా వచ్చేది శ్రావ్యమయిన సంగీతం కాదు. భయంకరమయిన ఉరుములు, పిడుగులు... ఎంత చెప్పినా వినిపించుకోకుండా- రాళ్లలోంచి సంగీతాన్ని వినడానికి ప్రయత్నించేదాపిల్ల. చాల ఇరిటేషన్ ఆ శబ్దం అంటే తనకి. శేఖర్ వచ్చే వేళకి మాత్రం- నీట్‌గా తయారై అర్థం లేని వాగుడు మొదలు పెట్టేది లక్ష్మి — అదోవిధమయిన అమాయకత్వం, అజ్ఞానంతో కూడిన లక్ష్మి.

"ఎవరీ వాగుడుకాయక్కా?"

"ఇంటర్ పోయింది. పాపం పనీ పాటు లేదు. ఆ పాన్‌షాపులోని గడ్డంతా నమిలిపారేస్తున్నది!"

"జాలేస్తుంది ఇలాంటి వారిని చూస్తే! నాలుగక్షరం ముక్కలు రాగానే అన్నీ చదివేస్తామనుకుంటారు. అన్నీ తెలుసనుకుంటారు. కాని నిజానికి ఏం చదవాలో, ఏం తెలుసుకోవాలో తెలీదు... పూర్ ఫెలోస్!"

నవ్వింది పూర్ణిమ. "అంత ఎనలైజ్ చేసేంత అమ్మాయి కాదు లక్ష్మి!"

పదిరోజులు తేలిగ్గా, హాయిగా గడిచిపోయాయి.

పదకొండో రోజు దిగేడు శంకర్రావు. "ఏమిటీ ఈ పుస్తకాలు ఇంటినిండా?" విసుక్కుంటూ.

"శేఖర్ ఇచ్చేడు" పుస్తకంలోంచే జవాబిచ్చింది లక్ష్మి.

"వాడెవడు?" కోపంగా, ఆశ్చర్యంగా అడిగేడు.

"అదే, ఒదిన ఫ్రెండు. రోజూ వచ్చి ట్యూషన్ చెప్తాడు కదా..."



విజయనగరం సాహితి మిత్ర సమాఖ్య విజయభావన నిర్వహించిన ప్రసంగ తరంగాల సభలో శ్రీ కూరెళ్ళ వెంకటశాస్త్రి అధ్యక్షోపన్యాసం చేస్తున్న దృశ్యం. ఇటీవల దివంగతులైన ప్రముఖులు ఇంద్రగంటి, తుమ్మల, దాశరథి, విద్వాన్ విశ్వం లపై వరుసగా ప్రసంగించిన డాక్టర్ ఎ. గోపాలరావు, శ్రీ చాగంటి సోమయాజులు, ఆచార్య భావన్, శ్రీ పున్నామరాజు నాగేశ్వరరావు వేదికపై వున్నారు.

పూర్ణిమ వైపు తిరిగాడు శంకర్రావు. "ట్యూషనా! దేనికి? ఇంక నువ్వొక్కదానివే తక్కువయిపోయావా దేశాన్నుద్ధరించడానికి?... నాకు తెలియకుండా ఇలాంటివెన్ని జరుగుతున్నాయింకా? ఈసారా గుంటనక్క వెధవ నాకు తెలీకుండా ఇంట్లో అడుగు పెట్టాలి... అంతే! మరి నేను మనిషిని కాను..."

ఇప్పుడు మహా అయినట్టు! అసహ్యంగా చూసింది పూర్ణిమ... "ఇవేమీ ఎవరికీ తెలీని రహస్య రామాయణాలు కావు. నేను ఎమ్మేకి కట్టినట్టు మీకు తెలుసు. శేఖర్ ఎవరో కూడా మీకు తెలుసు. చిన్నప్పట్నించీ...."

"నోర్మూయ్!" ఛెళ్లుమంది చెంప.

ఓహ్! తీవ్రంగా, కోపంగా, అసహ్యంగా చూసింది చెంప పట్టుకుని పూర్ణిమ. "ఛీ... ఛీ... మీరు... నువ్వు... మనిషివి కాదు... మృగానివి... రాక్షసుడివి.."

బిక్క చచ్చిపోయి చూస్తోంది లక్ష్మి...

....అసహనంగా తల అటూ ఇటూ కదిల్చి ఒక పక్కకు నిలిపింది... మొహం మీద పడుతోంది జుత్తు. కళ్ళముందు గజిబిజిగా వెంట్రుకలు. తొలగించే ప్రయత్నం చేయలేదు పూర్ణిమ.

తను ఆశించిన జీవితం ఇది కాదు. తను కోరుకున్న జీవితం ఇది కానే కాదు. ప్రతి క్షణం తనను తను చంపుకుంటూ, పరిస్థితులతో ఏ మాత్రం రీజనింగ్ లేని మనుషులతో రాజీపడాలా? మనిషి పరిస్థితులకి లొంగిపోక తప్పదా? నో, నెవర్! ఆమెలో ఆమెకే తెలియని ఏదో శక్తి గర్జించింది. నెవర్! తను తనుగా బతకాలి. ఏం చెయ్యాలి? ఏదో చెయ్యాలి... ఏదో చెయ్యాలి. ఎవరు తననర్థం చేసుకుంటారు? ఎవరు తనకి సహాయం చేస్తారు?... ఎవరు తననీ భయంకరమయిన ఒంటరితనం నించి రక్షిస్తారు? ఎవరు?... ఎవరు?... గుండెలోతుల్లోంచి ఉరుకుతూ వస్తున్నాయి కన్నీళ్లు!

.... శంకర్రావు లక్ష్మిని రైలెక్కించడానికి వెళ్ళాడు.

"అక్కా! నువ్వేం చదవడంలేదీ మధ్య?" శేఖర్ అన్నాడు.

"శేఖర్! నాకు... నాకు బతకాలని లేదు. ఏదయినా మార్గం చూపించు..." ఆమె మనసులో ఏ ఆలోచనా లేదు. అంతా చీకటి లాంటి నిస్పృహ.

అదిరిపోయేడు శేఖర్. "ఏమయింది నీకివాళ?" ఆమెనెలా ఓదార్చాలో తెలియలేదు. "ఓ పని చేయక్కా! కొన్నాళ్లపాటు మన ఊరు వెళ్లిరాకూడదూ!"

"హు... మన ఊరు... ఏముంది, ఎవరున్నారు నాకక్కడ?"

"అదేంటక్కా... మీ అమ్మ... నాన్న..."

"నో... నా కెవ్వరూ లేరు. ఐ హేట్ దట్ ప్లేస్. ఐ హేట్ ఎవ్విరిబడీ. శేఖర్! నువ్వు కూడా వెళ్ళిపో. ఇంక రాకు నా దగ్గరికి. ప్లీజ్ గెటవుట్.. లీవ్ మి ఎలోన్!" పిచ్చిగా, కోపంగా అరుస్తూ మంచంమీద బోర్లాపడి వెక్కి వెక్కి ఏడవసాగింది.

ఎందుకీ ఆవేశం?... శేఖర్‌కేం అర్థం కాలేదు. ఏం చెయ్యాలో అసలే తెలీలేదు.

అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు జారిపడ్డాయి తలగడ మీద. పూర్ శేఖర్! తరవాత పదిహేను రోజులపాటు రాలేదు.

"శేఖర్! ఇన్నాళ్లు ఎందుకు రాలేదు? నిజంగానే నేను చచ్చిపోయాననుకున్నావా?"

ఏం మాట్లాడలేదు శేఖర్.

"నరేంద్ర దగ్గర్నించి ఉత్తరాలేమయినా వస్తున్నాయా?" తనే అడిగింది మళ్లీ.

జేబులోంచి కవరు తీసి అందించాడు.

సుషమా బెనర్జీతో తన పరిచయం, స్నేహం, ప్రేమ- ఆమె గురించి ఇంకాస్త రాసి, ఆమెను పెళ్లి చేసుకోవాలనుకుంటున్నానని, నీ ఉద్దేశమేమిటని రాశాడు.

మనస్ఫూర్తిగా సంతోషించింది పూర్ణిమ. నువ్వేమయినా సాధించగలవు నరేన్! నీ లాంటి భర్త కోసం ఆ అమ్మాయి ఎన్ని పూజలు చేసుకుందో! నీ లాంటి ఉన్నతమయిన మనసున్న వారికి, ధైర్యం, తెగింపు వున్న వారికి అదృష్టం కూడా వెన్నంటే వుంటుంది.

ఆ రోజంతా నరేంద్ర కళ్లలో మెదుల్తూనేవున్నాడు. చివరిసారిగా నరేన్, తను కలిసి వెన్నెల్లో చేసిన ఆ నౌకా విహారం మరిచిపోగలదా!

... పడవ నరేంద్ర నడుపుతున్నాడు. వెన్నెల రిఫ్లెక్షన్స్ చూస్తోంది తను. ప్రతిబింబాల వెలుగులో మెరుస్తున్న ఆమె మొహాన్ని చూస్తున్నాడు నరేంద్ర.

"పూర్ణిమా, నీకు పెళ్లట..."

"ఊ" చిలిపిగా వంగి నీరు చేత్తో తీసి అతని మొహం మీద జల్లుతూ అంది. "చేసుకోవద్దా?"

మాట్లాడలేదు నరేంద్ర. "అతనెలా వుంటాడు?" కాస్సేపాగి అన్నాడు.

"నీ కన్నా బావుంటాడు."

"ఏం చదివేడు?"


"నీ కన్నా ఎక్కువే!"

చురుగ్గా చూశాడామెవైపు. కొంటెగా నవ్వుతోందామె. అటూ ఇటూ కదుల్తున్న వెండి జుంకాలు వింతగా మెరుస్తున్నాయి. అవును... ఎక్కడ తన బి.ఎస్సీ., ఎక్కడ అతని ఇంజనీరింగు...

"పూర్ణీ... నీకు బాగా నచ్చేడా అతను?"

"ఊఁ.. విశాఖ అంటే నా కెంతో ఇష్టం. పోర్ట్‌లో అతను ఇంజనియర్. విష్ మి ఎ గుడ్ మేరిటల్ లైఫ్." కలల్లో తేలిపోతూ అంది.

మౌత్ ఆర్గాన్ తీసి, పూర్ణిమ కిష్టమయిన 'నా




హృదయంలో నిదురించే చెలీ' వాయించసాగాడు. అతనికి తెలీకుండానే ఎన్నో అపశ్రుతులు పలుకుతోందది.

"ఛ! ఇవాళ ఏం బాగా వాయించలేదు నువ్వు. నా కిష్టమయిన పాట పాడు చేశావు."

"ఓ! సారీ! మళ్ళీ వాయిస్తాను"

"ఏం అక్కర్లేదు!"

ఈసారి కాన్సెన్ట్రేట్ చేసి వాయించాడు. ఆనందంతో చప్పట్లు కొట్టింది పూర్ణిమ.

"ఇలా మనం కలిసి తిరగడం ఇదే. లాస్టేమో కదూ!" ఒడ్డునే ఇసుకలో నడుస్తున్నారు.

నవ్వింది పూర్ణిమ వెన్నెల కురుస్తున్నట్టు. అతని చేయి తన చేతిలోకి తీసుకుని ప్రేమగా నొక్కుతూ అంది. "పిచ్చీ! మరింక తిరిగి రాని చోటుకి పోతున్నట్టు బాధ పడిపోతావేం? ప్రతి నెలా వచ్చేస్తుంటాను.... నువ్వూ వస్తుంటావు నా స్వీట్ హోమ్‌కి... ఎప్పటికీ విడిపోం మనం..."

తెల్లటి చీరలో- వీనస్‌లా మెరిసిపోతుంది పూర్ణిమ.

ఇద్దరి చేతులు కలుస్తున్నాయి- విడిపోతున్నాయి.

"పూర్ణీ!" అతనికేదో చెప్పాలనుంది. ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియడం లేదు.

— "పూర్ణి, నీకెప్పుడేం కావాలనిపించినా, చెప్పాలనిపించినా... నన్ను మర్చిపోవద్దు"

ఒక్క క్షణం నిలబడి అతనివైపు తిరిగి అంది. "అలాగే!"

"గుడ్‌నైట్, అండ్ గుడ్‌లక్" ఆమెనింటి దగ్గర దింపి వెళ్ళిపోయాడు నరేంద్ర.

నరేన్! నరేన్!...ఆక్రోశించిందామె హృదయం. నిన్నేమాత్రం అర్థం చేసుకోలేకపోయాను. అది అమాయకత్వమా? అజ్ఞానమా? అహంకారమా? ఏమయినా కానీ! తన కళ్ళను కప్పిన ఆ పొరలు కొద్ది రోజుల్లోనే రాలిపోయాయి. గుంటూరు దగ్గర ఏదో పల్లెటూర్లో పుట్టిన శంకర్రావు పడుతూ లేస్తూ ఎలాగో ఎల్లెమ్ ఇ పాసయాడు. పోర్ట్‌లో సర్వేయర్. ఎటువంటి ప్రత్యేకమయిన అభిరుచులు, అభిప్రాయాలు లేని బిలో ఏవరేజ్ మనిషి. ఈనాటి చదువులు మనుషుల్లో ... ముఖ్యంగా ఆడపిల్లల్ని పాడుచెయ్యడానికే అని అతని అమూల్యాభిప్రాయం. భార్య అంటే భరింపబడేది. అంతే! తను ఊహించిన, ఆశించిన భర్త కానే కాడతను ... ...

కొళాయి వస్తున్న శబ్దానికి ఉలిక్కిపడి లేచింది పూర్ణిమ. చల్లటి నీళ్ళలో గంటసేపు హాయిగా స్నానం చేసి, ఫ్రెష్‌గా తెల్లటి హేండ్లూమ్ చీర కట్టుకుని బాల్కనీలోకొచ్చింది. తన కెంతో యిష్టమయిన లిల్లీలు, గులాబీలు, మల్లెలు - ఎండకు వాడిపోయి, అలిసిపోయి, తనను చూడగానే దగ్గరకు రమ్మంటూ పిచ్చిగా తలలూపేయి. లోపలికెళ్ళి బకెట్‌తో నీళ్ళు తెచ్చి అన్నిటినీ తడిపింది. ఎగ్జైటింగ్ మట్టివాసన. తమను అర్థం చేసుకున్నందుకు ఎంతో ఎంతో ధన్యవాదాలు చెప్తూ మరింత సువాసనలు వెదజల్లేయి పువ్వులు.

కుర్చీ వేసుకుని, పిట్టగోడనానుకుని కూర్చుంది పూర్ణిమ. మనుషులు, వాహనాలు, కన్వేయర్ బెల్ట్, సముద్రం, కెరటాలు ... ఓహ్! ఏం బిజీ! ప్రపంచం అంతా ఏదో సాధించడానికి, ఎక్కడికో పోవడానికి తాపత్రయం - తనకు తెలియకుండానే గమ్యం వైపు ప్రయాణం.

నాలుగు వారాలయింది శేఖర్ ఊరెళ్ళి శలవులని - ఒక్క ఉత్తరమయినా రాయలేదేం? ...

వింత రంగుల్లో ప్రజ్వరిల్లుతోంది సముద్రం. ఇక్కడనించి బీచ్ కనబడదు- సముద్రం మాత్రం కనిపిస్తుంది. సముద్రంపైన ఆకాశంలో ఒకే ఒక నక్షత్రం... చిన్నగా మిణుకుమిణుకుమంటూ. తన కింకేం కోరికలున్నాయి? అయినా నక్షత్రాలు కోరికలు తీరుస్తాయా?

ఎదురింట్లో ఆమె - బాబు నెత్తుకుని బయటి కొచ్చింది. మొహంలో ఏ మాత్రం జీవకళ లేని ఆమెని, ఎప్పుడూ అనారోగ్యంగా, అగ్లీగా వుండే - వాణ్ణీ చూస్తే తనకి ఏదో అర్థంకాని డిప్రెషన్! సన్నగా, నల్లగా, ఎముకల పోగులా - ఎందుకలా వుంటాడు వాడు?

అతను ఏ రాత్రో పీకలమొయ్యా తాగి ఇంటి కొస్తాడు. ఇంకానయం, శంకర్రావులో అదొకటి లేదు! పిల్లల్ని పడుకోబెట్టి, ఆమె మాత్రం మేలుకునే వుంటూ వుంటుంది కొంతసేపటి వరకు. ఏవో కేకలు, ఏడుపులు ... ఓహ్! ... ఎంత నరకం! ఆ తరవాత? తరవాతేమవుతుంది? ఎలా భరిస్తూందామె? ఎలా గడుపుతున్నారిలాంటి జీవితాన్ని వీళ్ళంతా! ఈ నకరం నించి మరి విముక్తి లేదా? గతిలేనివారిలా, దిక్కులేని వారిలా అలాపడి వుండాల్సిందేనా? స్త్రీలు తమ వ్యక్తిత్వాన్ని, శీలాన్ని తమంతట తాము కాపాడుకునే రోజులింక రావా? తన కోసం తను, తన కిష్టమొచ్చిన రీతిలో బతకలేదా స్త్రీ!?

* * *

రాత్రి పది గంటలు —

ఇలియట్ 'వేస్ట్ లాండ్' చదువుతోంది పూర్ణిమ.

చిన్న బాబున్న కేలండర్ తెచ్చి తగిలించాడు శంకర్రావు పడవ్‌గా. వక్కపొడి నోట్లో వేసుకుని, దిండ్ల నానుకుని మంచం మీద జారగిలబడ్డాడు. ఆమె వైపు చూశాడు ఆ కేలండర్ చూస్తుందేమో అని. ఏమీ పట్టించుకోలేదు ఆమె.

"పూర్ణిమా!" - నెమ్మదిగా పిలిచాడు.

పలక లేదు పూర్ణిమ.

"నిన్నే ..."

పుస్తకంలోంచి తలెత్తి చూసింది ఏమిటన్నట్టు. కాస్త చిరాకు కనీకనిపించనట్టు.

"మన పెళ్ళయి ఎన్నాళ్ళయింది?"

మళ్ళీ పుస్తకంలోకి తలదూర్చింది.

పళ్ళ సందుల్లో ఇరుక్కున్న వక్కపొడిని పుల్లతో లాగుతూ అన్నాడు. "నీతో ఒక విషయం చెప్పాలి. ఇలారా!"

పేజీ తిప్పిందామె. ఎంత ఇంట్రస్టింగ్ పొయిట్రీ!

లైట్ స్విచ్ ఆఫ్ చేసేశాడతను. త్రుళ్ళిపడింది పూర్ణిమ.

"సరే! ఆ గదిలో చదువుకుంటాను నేను..."

పుస్తకం పట్టుకుని పక్క గదిలోకి వెళ్తాంది. మంచం పక్కకి రాగానే ఆమె కొంగు పట్టుకుని ఒక్క ఊపున లాగేడు. ఊహించని విధంగా పడిందామె మంచం మీద. విసురుగా లేవబోయింది. అంతే! ... మరి లేవనీయలేదతను.

"ఓహ్! ఏమిటిది? ... నాకిష్టం లేదు - వదలండి."

ఎదురింటి బాబు ఆమె కళ్ళముందు మెదిలాడు భయంకరంగా. ఓహ్! వాడెందుకలా వుంటాడు? ఇష్టం, ఇంట్రస్టులేని భార్యకి, పశువులా ప్రవర్తించే భర్తకి - ఇంకెలాంటి పిల్లలు పుడతారు?

తన జీవితం ఏమిటో తనకే తెలియని, ఈ స్థితిలో పిల్లల్ని కనడం అంటే - అంతకన్నా క్షమించరాని నేరం మరోటి లేదు.

అంతరాంతరాళాల్లో ఒణికిపోయింది పూర్ణిమ.

"భార్యా భర్తల మధ్య ఇష్టం, అయిష్టం ఏమిటి?" మరి దేనికి పెళ్ళి చేసుకున్నట్టు - అన్నట్టుగా అడిగేడు శంకర్రావు.

"ఛీ! ... నువ్వు ... మనిషివి కావు. మృగానివి. జంతువులు కూడా పార్టనర్‌కి ఇష్టం లేకపోతే దగ్గరికి రావు ... ఓహ్! ... వదులు..."

మరింత రెచ్చిపోయాడు శంకర్రావు. అతనలా తనను చుట్టేస్తుంటే కొండ చిలువ చుట్టుకున్నట్టు... అణువణువునా అతనంటే అసహ్యం ... ఆమెలోని ప్రతి రక్తపు బొట్టు ఎదురు తిరుగుతోంది. 'రేప్'కి, దీనికి ఎక్కడ తేడా? ఇదో 'లైసెన్స్‌డ్ రేప్'! ఏం చెయ్యాలి? ఏం చెయ్యాలిలాంటి వారిని? ఉరితీయాలి. షూట్ చెయ్యాలి నిలువునా. అణువణువునా చిత్రవధ చెయ్యాలి. ఓహ్ గాడ్! నా జీవితానికి విముక్తి లేదా? నా అశాంతికి అంతం లేదా? తనెందుకు ఏమీ చెయ్యలేకపోతోంది! తనకి తెగింపు లేదు; ధైర్యం లేదు — ప్రతి నిమిషం ఇలా ఛస్తూ బతకడం ... అతి నిస్సహాయంగా కళ్ళు మూసుకుందామె. ఆమెకి తెలియకుండానే ఎన్నో కన్నీళ్ళు వేస్టయి పోతున్నాయి.

* * *

తలుపులు తెరిచింది పూర్ణిమ. చల్లటి ఉదయపు గాలి - ఫ్రెష్‌గా, ఓదార్పుగా ఒళ్ళు నిమిరింది. తనకిష్టమయిన గులాబీల కుండీ మీద మూడు పక్షులు - అలికిడవగానే చిన్నగా విజిల్ వేస్తూ, హాయిగా, స్వేచ్ఛగా ఎగిరిపోయాయి. క్రీపర్ లెటర్! లెటర్ ఫ్రమే డియర్ వన్! నరేన్! సన్నగా జలదరించిందామె హృదయం. జిడ్డుగా వున్న ఆమె ముఖంలో, విశాల మయిన కళ్ళల్లో పైకి లేస్తున్న సూర్యుడు వింతగా ప్రతిబింబిస్తున్నాడు. ఎర్రగా మెరిసిపోతున్నాయి సముద్రజలాలు!...

"పోస్ట్!"

రస్సెల్ — 'కాంక్వెస్ట్ ఆఫ్ హేపినెస్' చదువుతున్న పూర్ణిమ ఉలిక్కిపడింది.

ఆమె గుండె ఒక్క క్షణం ఆగి మళ్ళీ కొట్టుకుంది. ఎవరు? ఎవరురాసేరు? నమ్మలేకపోతూంది. నరేం

## ఇరవయ్యో శతాబ్దం

ఇరవయ్యో శతాబ్దపు కాల్వ దాటివచ్చాను నేను
నా కంఠంలో మండుతున్న విప్లవం
నా భుజం మీద పాత శవం
తమ్ముడూ, శ్రామిక కవీ
చాతకాల చకోరాల పాటలెన్నో విన్నావు
వృథాగా విరహ నిశీథ గీతాలెన్నో రాశావు
ఆ వృథా గీతాలు చూసి ఎంతో కన్నీరు కార్చావు
పూల వనాల్లో కూర్చొని కోయిల పాట విన్నావు
తమ్ముడూ, శ్రామిక కవీ
ఇక ఆపి, చెప్పేది విను
ఈ పీడిత మానవరూపం చూడు

ఒరియా మూలం: సచీ రౌతాయ్
(1987 జ్ఞాన్‌పీఠ్ అవార్డు గ్రహీత)
తెలుగు అనువాదం: డాక్టర్ మల్లిప్రియ
నాగరాజు

ద్రేవా! కలకత్తా వెళ్తూ మధ్యలో ఇక్కడ దిగి రెండ్రోజులు తనతో గడపాలనుందని, ఆ అవకాశం, సమయం కూడా లేనందువలన కనీసం స్టేషన్‌లో కలవమని రాసేడు. వాటె స్వీట్ సర్‌ప్రయిజ్! కాని ... కాని ... ఎలా? నరేంద్రకి రావాలనే వుంది ... తను ఒక్క మాటంటే చాలు ... కాని ... శంకర్రావుని కన్విన్స్ చెయ్యడం ఎలా? ...

కూర తరుగుతూ ఆలోచిస్తోంది పూర్ణిమ. రేపీపాటికి ...

శంకర్రావు కెలా చెప్పడం?

ఆత్రుతగా, ఆందోళనగా, అశాంతిగా, ఉత్సాహంగా వుంది.

"పూర్ణిమా!" ... గావుకేక పెట్టేడు శంకర్రావు. త్రుళ్ళిపడింది.

నెమ్మదిగా, ఇబ్బందిగా అతని వైపు చూసింది. అతని చేతిలో ఆ ఉత్తరం. విలవిల్లాడింది ఆమె మనసు.

"ఎవడీ నరేన్? ఎంత దర్జా వీడికి? రేపు వచ్చి తిష్టవేస్తాడా నీ మొహం మీద?"

అయిపోయింది. అంతా అయిపోయింది. ఇంకతన్ని కన్విన్స్‌చెయ్యడం ఇంపాజిబుల్!

"వాడు రావడానికి వీల్లేదు - నువ్వు స్టేషన్‌కి వెళ్ళడానికి వీల్లేదు."

అప్పటికీ ఏం మాట్లాడలేదు. ఆలోచనల జిగ్ జాగ్‌లో అక్కడికక్కడే కొట్టుకుంటూంది.

"వాడికెంత సిగ్గులేదు - పెళ్ళయి సంసారం చేసుకుంటున్న స్త్రీతో ..."

"అతనిక్కడ దిగుతానని రాయలేదు. ఎందుకలా గొంతు చించుకుంటారు?..."

"షోర్మ్మయ్! ఆ వెధవ వస్తే ఇద్దర్నీ కలిపి పాతేస్తాను. బజారుదానిలా వాడితో ..."

"ఆపండి." అప్రయత్నంగా లేచి నుంచుంది. కళ్ళల్లో అగ్ని జ్వాలలు. గుండెల్లో లావా. ఏక్షణంలో నయినా బద్దలవబోయే అగ్నిపర్వతంలా వుందామె. "నువ్వు మనిషివి కావు ... మృగానివి. రాక్షసుడివి ... సంస్కారమన్నది లేదు నీకు" ఆవేశంలో మాట్లాడలేకపోతూంది. "నువ్వంటే ... నువ్వంటే ... అసహ్యం ... చాలా ... అసహ్యం నాకు!"

ఆ రాత్రి ఇద్దరూ అశాంతిగా ఎవరికి వారు ...

ఏం చెయ్యడం? ఏం చెయ్యడం? ... ఏం చెయ్యడం? ...

"నీకు నేనున్నాను పూర్ణీ!" ఎంత చల్లని స్నేహ పూరితమయిన ఓదార్పు!

పొద్దున్న ఆఫీసుకెళ్తూ గట్టిగా చెప్పేడు శంకర్రావు. "ఇవాళ ఒంటిగంటకల్లా వచ్చేస్తాను. ఇంట్లోనే వుండు" వెళ్తున్న అతని వైపు తీక్షణంగా చూస్తుండిపోయింది పూర్ణిమ.

ఒంటి గంటన్నర ...

శంకర్రావు లోపలి కొచ్చేడు. పూర్ణిమ లేదు. ఆ రెండు గదుల విశాల భవనంలో ఎంత వెతికినా కనబడలేదు. గదిలో ఒక మూల పీట, కంచం, చుట్టూ గిన్నెలు పెట్టి వున్నాయి. వెళ్ళి కూర్చున్నాడు. కంచంలో చిన్న చీటి ... విప్పి చూశాడు.

"వెళ్తున్నాను. గుడ్‌బై"

అతని కర్థం కాలేదు. కోపంతో మండిపోయేడు. దొంగ రాస్కెల్! నన్ను కాదని వెళ్తావు కదూ! రా నీ పని చెప్తాను. పాతేస్తాను, చంపేస్తాను ... చిత్రవధ చేస్తాను - అంతదాకా నాకు మనశ్శాంతి లేదు.

మధ్యాహ్నం దాటిపోయింది. సాయంత్రం అయింది. రాత్రి కూడా ...

కాని ...

ఆమె రాలేదు.

